# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 09 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- చెట్టును కారు ఢీకొట్టడంతో నలుగురు విద్యార్థులు మృతి



**బలగం టీవి, హైదరాబాద్**

అతివేగంగా వస్తున్న కారు.. అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మోకిలా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం దొంతానపల్లిలోని ఇక్ఫాయ్ (ఐబీఎస్) కళాశాలలో సూర్యతేజ (20), సుమిత్ (20), నిఖిల్(18), సాయి, నక్షత్ర బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్నారు. రోహిత్ (20) ఎంజీఐటీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. మొత్తం ఆరుగురు బుధవారం రాత్రి కోకాపేటలో జరిగిన ఓ బర్త్ డే వేడుకకు వచ్చారు. పార్టీ అనంతరం స్పోర్ట్స్ కారులో ఆరుగురు తిరుగు ప్రయాణమయ్యారు. పొద్దుటూరు,

మిగితా 2వ పేజీలో

## ఓటర్ల తుది జాబితా గడువును పెంచాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఓటర్ల తుది జాబితా గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివిధ రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేశాయి. గురువారం హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సమావేశం నిర్వహించారు. వార్డుల విభజన సహేతుకంగా లేదనీ, రెండు చోట్ల ఓట్లున్న వారి ఓట్లను రద్దు చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్ల జాబితా ప్రచురిస్తామనీ, ప్రస్తుతం సవరణలకు అవకాశం లేదని రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలపై ఆమె వివరణ ఇచ్చారు. "రాష్ట్రంలోని ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలోని (366) వార్డులు, 117 మున్సిపాల్టీల్లోని (2,630) వార్డులకు తెలంగాణ మున్సిపాల్టీ చట్టం, 2019లోని సవరించిన సెక్షన్ 195-ఏ ప్రకారం వార్డు వారీ ఓటర్ల తుది జాబితాను ఈ నెల 12న ప్రచురిస్తాం. 13 నాటికి పోలింగ్‌స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితాను ప్రచురించి వాటిని టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం. జనవరి 16న పోలిం గ్‌స్టేషన్ల వివరాలతో పాటు ఫొటోతో కూడిన ఓటర్ల తుది జాబితాను వార్డుల్లో ని పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రచురిస్తాం" అని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మాజీ శాసనసభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ(ఎం) సీనియర్ నేత డీజి.నర్సింహరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కారదర్శి ఈటీ.నర్సింహ, కాంగ్రెస్ నాయకులు రాఘవేంద్ర, బీఆర్ఎస్ నాయకులు సోమ భరత్, దేవి ప్రసాద్, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి ఇతర పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చిన మోదీ ప్రభుత్వం



- పునరుద్ధరణకు కాంగ్రెస్ పోరాటం
- ఈ నెల 20 నుంచి గ్రామసభలు, ఫిబ్రవరి నుంచి జిల్లా సభలు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడుమహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం, రానున్న కార్యక్రమాలు, మున్సిపల్ ఎన్నికల వ్యూహాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మహాత్మాగాంధీ పేరుతో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం పేరు మార్చడమే కాకుండా, పథక ఉద్దేశాన్ని కూడా నీరుగార్చి పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ చట్టాన్ని యదాతథంగా పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యచరణ రూపొందించాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఉపాధి హామీలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను నిరసిస్తూ ఇప్పటికే రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ఈ పథకాన్ని పాత రూపంలోనే కొనసాగించాలనే డిమాండ్‌తో ఈ నెల 20 నుంచి 30 వరకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలని నిర్ణయించారు.

అదేవిధంగా ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు జిల్లాల వారీగా భారీ బహిరంగ సభలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కృషితోనే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం అమలుతో వెట్టిచాకిరి పూర్తిగా నిలిచిపోయిందని, గ్రామాల నుంచి వలసలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. గ్రామీణ కార్మికుల్లో పనికి తగిన వేతనం కోరే అవగాహన పెరిగిందన్నారు. దేశంలో సుమారు 80 శాతం ప్రజలు ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని వెల్లడించారు.


మిగితా 2వ పేజీలో

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో

# తొలి విడతలో బాలికలకు ప్రాధాన్యం

- మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలో
- బాలురు బాలికలకు స్కూల్ పూర్తి
- రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనంపై కసరత్తు
- వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి నగరంలో నూతన పాఠశాలలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తొలి విడతలో పూర్తయ్యే భవనాల్లో ఎక్కువ భాగాన్ని బాలికలకు కేటాయించాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యా శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు, ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు సిలబస్‌లో మార్పులపై ఆయన విస్తృతంగా సమీక్షించారు.

ప్రస్తుతం బాలికలకు కేటాయించిన నియోజకవర్గాల్లో రెండో విడతలో బాలురకు స్కూల్స్ కేటాయించాలని సూచించారు. ఈ స్కూళ్లలో సోలార్ కిచెన్ల నిర్మాణాలను పీఎం కుసుమ్ పథకం ద్వారా చేపట్టే అవకాశాలను పరిశీలించాలని, నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని అధికారులకు ఆదేశించారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన ప్రభుత్వ పాఠశాల భవనాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని తెలిపారు. బాచుపల్లి పాఠశాల నిర్మాణానికి సమీపంలో ఉన్న ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని కేటాయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్ సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై వెంటనే కసరత్తు ప్రారంభించాలని ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం పనులను వేగవంతం చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన కోర్సులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు టాటా టెక్నాలజీస్‌తో కుదిరిన ఒప్పందాన్ని త్వరగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని స్పష్టం చేశారు.

కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. తగిన స్థలం, మద్దతు అందిస్తే ఈ పథకాన్ని తెలంగాణ అంతటా అమలు చేయవచ్చని అక్షయపాత్ర ప్రతినిధులు సమావేశంలో తెలిపారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాల లీజు అంశంపై జిల్లా కలెక్టర్లతో చర్చించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, పి. సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ కుమార్ మొలుగరం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్. సుబ్బారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో ప్రీ-ప్రైమరీ విద్య..



- సర్కారీ బడుల బలోపేతమే లక్ష్యం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,
- హిమాచల్ ప్రదేశ్ మంత్రితో సీఎం భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్:**

ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ విద్యను అందించే విధానాన్ని అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాకూర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ని

మిగితా 2వ పేజీలో

## జీహెచ్‌ఎంసీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం అమలు

- ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ

**బలగం టీవి, హైదరాబాద్**

జీహెచ్‌ఎంసీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం 2025-26ను కొనసాగిస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం తెలిపారు. ఈ పథకం ద్వారా ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 90 శాతం మాఫీ లభించనుంది. ఈ పథకం ప్రకారం పన్ను చెల్లింపుదారులు పూర్తి ప్రిన్సిపల్ ట్యాక్స్‌తో పాటు కేవలం 10 శాతం వడ్డీ మాత్రమే ఒక్కసారి చెల్లిస్తే, మిగిలిన 90 శాతం వడ్డీ పూర్తిగా మాఫీ అవుతుంది. దాంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కలుగుతుంది. పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని నగరాభివద్ధికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఓటీఎస్ పథకం కింద చెల్లింపులు 'మైజీహెచ్‌ఎంసీ' యాప్, మీ సేవ కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ సిటిజన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీఎస్), ఆన్‌లైన్ విధానాల ద్వారా చేయవచ్చు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించడం ద్వారా నగర మౌలిక సదుపాయాలు, పౌర సేవలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు తెలిపారు.

## రైతులు హెచ్‌టీ విత్తనాలు కొనొద్దు

- అనుమతిలేని హెచ్‌టీ పత్తి విత్తనాలపై ఉక్కుపాదం
- రాష్ట్ర సరిహద్దుల్లో టాస్క్‌ఫోర్స్ టీమ్స్‌తో కఠిన నిఘా
- రైతులను మోసం చేసే దళారులపై కఠిన చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని హెచ్‌టీ(హెర్బిసైడ్ టోలరెంట్) పత్తి విత్తనాలు రాష్ట్రంలోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. పత్తి విత్తనాల విక్రయాలపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నిషేధించిన హెచ్‌టీ పత్తి విత్తనాలను రాష్ట్రంలో విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హెచ్‌టీ పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్శాంటో కంపెనీ అభివృద్ధి చేసినప్పటికీ, ఫీల్డ్ ట్రయల్స్‌లో విఫలమవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఈ విత్తనాలకు అనుమతి ఇవ్వలేదని మంత్రి తెలిపారు. అయినప్పటికీ కొందరు దళారులు స్వలాభం కోసం రైతులను మోసం చేస్తూ హెచ్‌టీ పత్తి విత్తనాలను అక్రమంగా విక్రయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అక్రమ రవాణాపై నిఘా**

రాష్ట్రంలో ప్రస్తుతం 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తున్నాయని, ప్రభుత్వం సర్టిపై చేసిన మరో 40 కంపెనీలు తెలంగాణకు పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్నాయని మంత్రి తెలిపారు. గత ఏడాది మొత్తం 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతులు కొనుగోలు చేశారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నిషేధించిన హెచ్‌టీ విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను కొందరు దళారులు మహారాష్ట్ర,

మిగితా 2వ పేజీలో

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌వి దొంగ నాటకాలు



- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపాలని నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అనేకసార్లు లేఖలు రాశానని, కేంద్రంతో కొట్లాడాను
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**బలగం టీవి, కరీంనగర్**

తెలంగాణకు నీళ్ల విషయంలో తీరని ద్రోహం చేసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని, ఆనాడు అడుగడుగునా ఉద్యమాలు చేసి అడ్డుకున్నది బీజేపీయేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు అసెంబ్లీ సాక్షిగా బూతులు తిట్టుకుంటూ, అబద్ధాలు ఆడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జల్‌శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం సహకారంతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపాలని తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అనేకసార్లు లేఖలు రాశానని, కేంద్రంతో కొట్లాడానని చెప్పారు. నాడు ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కై కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ సమావేశాలకు డుమ్మా కొట్టారని, కేంద్రం జోక్యంతోనే కేఆర్ఎంబీ ద్వారా రాయలసీమ ప్రాజెక్టు ఆగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగితే.. కేవలం రూ.9వేలకోట్ల విచారణకే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పరిమితమయ్యారని ప్రశ్నించారు. తక్షణమే దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలు, బీఆర్ఎస్ పదేండ్ల అవినీతిపై అసెంబ్లీలో చర్చ జరపాలన్నారు. కమీషన్ల కక్కుర్తిని పక్కనపెట్టి కృష్ణానది జలాల్లో రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూడాలని, ఇందుకు కేంద్రం సహకరిస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అవినీతి అక్రమాలను బయటపెడుతున్న కల్వకుంట్ల కవితకు హ్యాట్సాప్, అవినీతి బయట పెట్టే వారికి తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్‌రావు, శంకర్, నాయకులు బోయినిపల్లి ప్రవీణ్‌కుమార్, బాస సత్యనారాయణ, గుగ్గిళ్ల రమేష్ ఉన్నారు.

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను ప్రశ్నించిన సిట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను సిట్ అధికారులు గురువారం ప్రశ్నించారు. సిట్ ఇచ్చిన నోటీసుల మేరకు ఇద్దరు మాజీలు జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయం ఎదుట విచారణకు హాజరయ్యారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో వీరికి, ఈ కేసులో నిందితులైన అధికారులతో ఉన్న సంబంధాలపై సిట్ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడ్డ అధికారులతో వీరు ఎవరి ఫోన్లను ట్యాపింగ్ చేయించారనే అనే సమాచారాన్ని కూపీ లాగడానికి అధికారులు ప్రయత్నించారు. ముఖ్యంగా ఈ కేసులో నిందితుడైన అదనపు ఎస్పీ తిరుపతన్నను లింగయ్య ఎదుట కూర్చోబెట్టి వారిద్దరి మధ్య ఉన్న సంబంధాల గురించి ప్రశ్నించారు. తిరుపతన్నకు లింగయ్య ఫోన్ నుంచి వెళ్లిన సందేశాల గురించి నిలదీసినట్టు తెలిసింది. మొత్తం మీద జైపాల్‌యాద్, లింగయ్యలను

మిగితా 2వ పేజీలో



## కేసీఆర్‌కు మేడారం జాతర ఆహ్వానపత్రిక

- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌కు అందజేసిన మంత్రులు
- బాగున్నారా.. అమ్మ!
- ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆత్మీయ పలకరింపు సాదర ఆహ్వానం
- అతిథి మర్యాదలతో, పసుపు కుంకుమలు చీర, తాంబూలాలతో ఆడబిడ్డలకు కేసీఆర్ సంప్రదాయ సత్కారం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే. చంద్ర శేఖర్ రావు గారు ఆత్మీయ ఆహ్వానం పలికారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ.. పంచాయతీ రాజ్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లి నివాసంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసారు. మరికొద్ది రోజుల్లో, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా, జాతరను సందర్శించాల్సిందిగా కోరుతూ కేసీఆర్ ను ప్రభుత్వం తరపున వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా, శాలువాకప్పి ఆహ్వాన పత్రికను అందజేసిన మంత్రులు కేసీఆర్ గారికి మేడారం ప్రసాదం అందజేశారు.

ఈ సందర్భంగా... తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ శోభమ్మ దంపతులు, వారిని పసుపు కుంకుమ వస్త్రాలు, తాంబులాలతో సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు.

కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందు

మిగితా 2వ పేజీలో

## దమ్ముంటే రేవంత్‌ను నిలదీయండి



- గాంధీ కుటుంబాన్ని తిట్టింది రేవంత్
- సోనియాను బలిదేవత అన్నది రేవంత్ కాదా?
- శేరిలింగంపల్లిలో ద్రోహం చేసిన ఎమ్మెల్యే గాంధీ అమ్ముడుపోయాడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతున్న మాట లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. రాహుల్ గాంధీని, సోనియా గాంధీని అడ్డగోలుగా తిట్టిన రేవంత్ రెడ్డిని తీసుకువచ్చి ముఖ్యమంత్రిని చేసుకున్న విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, నేతలు మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీపై తాను చేసిన వ్యాఖ్యలు గతంలో రేవంత్ రెడ్డి అనేక సార్లు చేశారన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఇదే రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి "ముద్దపప్పు" అన్నాడని, అదే మాటను నేను రిపీట్ చేసినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి సోనియా గాంధీని "వెయ్యి మందిని బలి తీసుకున్న బలిదేవత.. తెలంగాణ పిల్లల్ని చంపింది" అని అన్నాడని, అలాంటి వ్యక్తిని పక్కన పెట్టుకొని తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు అభ్యంతరం చెప్పడంపై సానుభూతి వ్యక్తం చేశారు.

గాంధీ కుటుంబాన్ని, రాహుల్ గాంధీని, సోనియా గాంధీని అడ్డగోలుగా తిట్టిన

మిగితా 2వ పేజీలో

# ప్రభుత్వ బడుల్లో ప్రీ-ప్రైమరీ విద్య..

(మొదటి పేజీ తరువాయి)

మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యా రంగం పట్ల తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి వివరించారు.

జాతీయ విద్యా విధానం తరహాలోనే తెలంగాణలోనూ త్వరలోనే ప్రత్యేక విద్యా విధానం తీసుకురాబోతున్న విషయాన్ని తెలిపారు. విద్యా విధానం కోసం ఇప్పటికే ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించామని, త్వరలోనే ఆ పాలసీని అమలులోకి తీసుకొస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ ప్రారంభించడమే కాకుండా పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లడానికి రవాణా సౌకర్యం కల్పించే ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్న వివరాలను, అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. విద్యా రంగంలో సమూల మార్పుల్లో భాగంగా చేపడుతున్న సంస్కరణలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న వివరాలను తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకేచోట మినీ యూనివర్సిటీ స్థాయిలో ఈ స్కూల్స్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఏటీసీగా మార్చిన మల్లేపల్లి (ఐటీఐ)ని సందర్శించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హిమాచల్‌ప్రదేశ్ మంత్రి కి సూచించారు. రాష్ట్రంలో నెలకొల్పుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపైన ఆసక్తి చూపించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని కోరారు.

ప్రభుత్వ రంగంలో విద్యా వ్యవస్థను పటిష్టపరచాలన్న ముఖ్యమంత్రి విజన్‌ను రోహిత్ ఠాకూర్ అభినందించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులు హెచ్‌టీ విత్తనాలు కొనొద్దు

(మొదటి పేజీ తరువాయి)

గుజరాత్ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఈ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు.

**టాస్క్‌ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు**

రాష్ట్రంలో సుమారు 52 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, దళారులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని అక్రమ విత్తనాలను తెచ్చే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ నెల నుంచే రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్

టీమ్స్ ఏర్పాటు చేసి పత్తి విత్తనాల అక్రమ రవాణాపై కఠిన నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కో-మార్కెటింగ్‌కు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని సూచించారు.

**రైతులకు అవగాహన కార్యక్రమాలు**

హెచ్‌టీ పత్తి విత్తనాలు కొనవద్దని రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కలుపును తట్టుకుంటాయని, అధిక దిగుబడి వస్తుందని చెప్పి ఇు విత్తనాలను రైతులకు అంటగడుతున్నారని, వీటిని ఉపయోగిస్తే అధికంగా కలుపు మందులు వాడాల్సి వస్తుందని తెలిపారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలగడంతో పాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్‌లకూ ముప్పు ఏర్పడుతుందని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డా. గోపి, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దమ్ముంటే రేవంత్‌ను నిలదీయండి

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డిని పక్కన పెట్టుకొని మాలాంటి ప్రతిపక్ష నేతలపై మాట్లాడడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ముంటే రేవంత్ రెడ్డిపై ప్రతాపం చూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డిని తప్పుపట్టడం చేతగాని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట్లాడుతున్న తీరు పైన కేటీఆర్ ఎద్దేవా చేశారు. 6 గ్యారంటీల అమలుపై రేవంత్ రెడ్డిని, రాహుల్ గాంధీని తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. అడ్డగోలు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డిని గట్టిగా అడిగితే "లాగులో తొండలు విడిచిపెడతా, పేగులు మెడలో వేసుకుంటా, గుడ్లు పీకి గోలీలు ఆడుతా"లాంటి బూతులు మాట్లాడుతున్నాడని కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్‌లో ఎన్నికలను ప్రభుత్వం త్వరలో పెడుతుందన్న వార్తలు వస్తున్నాయని, ఈ ఎన్నికలను పార్టీ శ్రేణులంతా కలిసి సమిష్టిగా ఎదుర్కొని విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 9,700 కోట్ల రూపాయల అభివృద్ధి చేసిన విషయాన్ని ప్రజలకు ప్రస్తావించాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన తీరు ప్రతి డివిజన్లోని ఓటర్లకు ప్రజలకు ప్రచారం చేయాలని కోరారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మన పార్టీ తరపున గెలిచి కేవలం భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి పక్షన చేరి ఎమ్మెల్యే గాంధీ డబ్బులకు అమ్ముడుపోయాడన్నారు. ఎమ్మెల్యే పార్టీని ద్రోహం చేసి వదిలిపోయిన శేరిలింగంపల్లిలో ఎక్కడ సమావేశం పెట్టినా భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేస్తున్నారని అన్నారు. కేవలం పార్టీ మీద కేసీఆర్ గారి మీద ఉన్న అభిమానంతోనే శేర్లింగంపల్లిలో జరుగుతున్న ప్రతి సమావేశం విజయవంతం అవుతుందని కేటీఆర్ తెలిపారు. "హైడ్రా" పేరుతో నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూలగొడుతున్న తీరును ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గత రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు చేసిన ద్రోహాన్ని, రద్దు చేసిన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ భవన్ లో పొట్ట నరేందర్ యాదవ్ భారీ ఎత్తున తన అనుచరులు, కార్యకర్తలతో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకుల చేరిక

- **కేటీఆర్ సమక్షంలో కొల్లాపూర్‌లో భారీ చేరికలు**
- **కాంగ్రెస్ అరాచకాలకు చెక్ పెట్టాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి: కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కొల్లాపూర్ నియోజకవర్గం, చిన్నంబావి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ దివ్యశ్రీ రంజిత్‌తో పాటు వార్డు మెంబర్లు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి కేటీఆర్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, రంగినేని అభిలాష్, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయ గౌడ్, ఇంతియాజ్ అలీ, కురువ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వస్తుందో లేదో, తాను గెలుస్తానో లేదో కూడా తెలియదని మంత్రి జూపల్లి కృష్ణారావు గతేడాది అదిలాబాద్‌లో చెప్పారని గుర్తు చేశారు. అలాంటి జూపల్లి కృష్ణారావును ఎట్టి పరిస్థితుల్లో గెలిపించబోమని కొల్లాపూర్ ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు జూపల్లి కృష్ణారావు కేసీఆర్‌ను ఎంతగా పొగిడారో అందరికీ తెలుసన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని సంతృప్తిపర్చేం దుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రి పదవిని కాపాడుకోవడానికే రేవంత్ రెడ్డిని ఇంద్రుడుఉచంద్రుడు అంటూ పొగడ్తలు కురిపిస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ పాలనను మూడు మాటల్లో చెప్పాలంటే ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలు తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. ఒకవైపు ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఎగవేస్తూ, మరోవైపు హైడ్రా పేరుతో ఇండ్లను కూల్చివేస్తూ, చెక్‌డ్యాంలను పేల్చివేస్తున్న అరాచక ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు. చెక్‌డ్యాంలు కట్టాల్సిన చోట పేల్చివేతలకు పాల్పడుతున్న ఏకైక దరిద్రపుగొట్టు ప్రభుత్వం ప్రపంచంలో కాంగ్రెస్ ఒక్కటేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టును పండబెట్టి రైతులను తొక్కుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం తన పాత బాస్‌కు కోపం వస్తుందనే ఉద్దేశంతోనే పాలమూరును పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో ఏ ప్రాంతం ఏ బేసిన్‌లో ఉందో కూడా తెలియని ముఖ్యమంత్రి నుంచి నీటి పాఠాలు అవసరం లేదన్నారు. బాక్రానంగల్ ఎక్కడుందో కూడా తెలియని వ్యక్తి కేసీఆర్‌కు నీటి పాఠాలు చెబుతానని అంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని కేటీఆర్ అన్నారు. వ్యవసాయానికి సంబంధించిన అన్ని పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివే సిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 11 సార్లు రైతు భరోసా అందిస్తే, కాంగ్రెస్ ఒక్కసారి ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో లేని యూరియాను యాప్‌ల ద్వారా ఇస్తామంటూ ప్రభుత్వం మాటలు చెబుతోం దన్నారు. కొత్తగా యూరియా కార్డు అంటూ నాటకం ప్రారంభించారని, ఒక్క బస్తా యూరియా కోసం కుటుంబమంతా లైన్లో నిలబడి యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అరాచకాల నుంచి తెలంగాణను కాపాడాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇందుకోసం పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని, రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గట్టిగా పోరాడి గెలవాలని ఆయన కోరారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చిన మోదీ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పథకం పేరును మార్చడంలోనే ప్రధాని మోదీ దురుద్దేశం దాగి ఉందన్నారు. ఎస్ఐఆర్ వెనుక కూడా పెద్ద కుట్ర ఉందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ జీ రామ్‌జీ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు.

ఉపాధి హామీ పథకం రద్దు చేస్తే మళ్లీ గ్రామాల నుంచి వలసలు మొదలవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు, అదానీఉఅంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకే ఈ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం బలహీనపరుస్తోందని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాలపై ఎలా క్షమాపణ చెప్పాల్సి వచ్చిందో, ఉపాధి హామీ విషయంలోనూ మోదీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

**కార్యకర్తల త్యాగాల వల్లే అధికారంలో ఉన్నాం**

పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాల వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తమకు వచ్చిన పదవులన్నీ కార్యకర్తల వల్లేనని అన్నారు. అందుకే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పటికీ నష్టపోడని పేర్కొన్న సీఎం, కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి ఎదిగిన వారేనని తెలిపారు. పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

మోకిలా గేటు వద్ద సాయిని డ్రాప్ చేశారు. అనంతరం సూర్యతేజ, సుమిత్, నిఖిల్, రోహిత్, నక్షత్ర ఐదుగురు హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. వీరు మీర్జాగూడ గేట్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. నక్షత్ర తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. గాయపడిన నక్షత్రను గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. నాలుగు మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోహిత్ వారిని డ్రాప్ చేయడానికి వచ్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పార్టీ ఎవరిది? ఆ పార్టీలో వీరితోపాటు ఎవరెవరు పాల్గొన్నారు? ఆరుగురిలో ప్రమాదం నుంచి తప్పించుకున్న వ్యక్తి ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కేసీఆర్‌కు మేడారం జాతర ఆహ్వానపత్రిక

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించిన మహిళా మంత్రులు, కాసేపు పరస్పర యోగక్షమాలు, ఇష్టాగోష్టి అనంతరం మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు.

కాగా.. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, సాదర ఆహ్వానం పలికారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను ప్రశ్నించిన సిట్

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి పలు ప్రశ్నలతో విచారణను అధికారులు కొనసాగించినట్టు సమాచారం. ఫోన్‌ట్యాపింగ్ కేసుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని మాజీ ఎమ్మెల్యే లింగయ్య అన్నారు. సిట్ విచారణ ముగిశాక వెలుపలికి వచ్చిన లింగయ్య కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. అదనపు ఎస్పీ తిరుపతన్నతో తనకేమన్న సంబంధాలున్నాయా అని ప్రశ్నించారని ఆయన తెలిపారు. ఫోన్‌ట్యాపింగ్‌లు అనేవి పోలీసు అధికారులు, వారికి ఉన్న నిబంధనల మేరకు చేస్తుంటారనీ, వాటి గురించి తనకేమీ తెలియదని లింగయ్య అన్నారు. తన ఫోన్ నుంచి ఎవరో తిరుపతన్నకు మెసేజ్‌లు చేశారనీ, ఆ విషయంలో తనకేం సమాచారమూ లేదనీ, వాటి గురించే ఎక్కువగా ప్రశ్నించారని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

# అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల మెరుపు ధర్నా

- **అడ్డుకున్న పోలీసులు.. 20 మంది అరెస్ట్**

**బలగం టీవీ, హైదరాబాద్**



జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు 2 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ అశోక్ నగర్‌లోని సిటీ సెంటర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు గురువారం మెరుపు ధర్నా నిర్వహించారు. నిరుద్యోగులు చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకెళ్తే గురువారం సాయంత్రం సిటీ సెంటర్ లైబ్రరీ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకు ఒక్కసారిగా భారీ సంఖ్యలో నిరుద్యోగులు, విద్యార్థులు గుంపులుగా ర్యాలీగా బయలుదేరారు. వి వాంట్ జస్టిస్ వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ర్యాలీ అశోక్ నగర్ ప్రాంతానికి చేరుకోగానే పోలీసులు అప్రమత్తమై ఆందోళనకు దిగిన వారిని ఎక్కడికక్కడ చెదరగొట్టారు. అయినా తప్పించుకుని నిరుద్యోగులు ధర్నాకు దిగారు. దాంతో దాదాపు 20 మంది ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో ఒక్కసారిగా అశోక్ నగర్ ప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఏ సమయంలోనైనా విద్యార్థులు మళ్లీ పెద్ద ఎత్తున ఆందోళన చేసే అవకాశం ఉండడంతో అశోక్ నగర్ పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు



- రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..
- మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలు, జైలు శిక్షలు తప్పవు..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బుధవారం రోజున జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 61 మందిపై , మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.తెలిపారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజాశాంతి భద్రతలు,రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం , మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, అందులో భాగంగానే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని,ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పరిధిలో ప్రతి రోజుల వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుదనిమద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటుగా కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్



లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు.

# బోయినిపల్లి గ్రామ శివారులో కత్తిపోట్లు కలకలం..

**బలగం టీవీ, బోయినిపల్లి:**



బుధవారం రోజున సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి గ్రామ శివారులో కత్తిపోట్ల సంఘటన కలకలం రేపింది. బోయినిపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# పేదలకు బీసీఎం ట్రస్ట్ వరం లాంటిది..

- రామన్నపేట సర్పంచ్ చింతలపల్లి కవిత వెంకటరెడ్డి

**బలగం టీవీ, బోయినిపల్లి:**

గ్రామీణ పేద ప్రజలకు కోదురుపాక బిసిఎం ట్రస్ట్ వరం లాంటిదని రామన్నపేట సర్పంచ్ చింతలపల్లి కవిత-వెంకటరెడ్డి చెప్పారు. బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక బీసీఎం ట్రస్ట్ కంటి దవఖాన వారి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ చింతలపల్లి కవిత వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ ఉచిత కంటి పెద్ద శిబిరంలో 150 మందికి ఉచిత పరీక్షలు చేసి, మరో కొందరికి కంటి ఆపరేషన్ చేసేందుకు ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ చింతలపల్లి కవిత వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కొదురుపాక బిసిఎం కంటి ఆస్పత్రి నిర్వాహకులు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వైరాగ్యం రాజలింగం-రీటా బహుదూర్ షా దంపతులు ఈ మారుమూల ప్రాంతంలో అధునాతన సౌకర్యాలతో కార్పొరేటుకు మించి కంటి దావకాన ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఇప్పటివరకు ఈ మూడేళ్ల కాలంలో 56 గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి,పదివేల మందికి పైగా కంటి పరీక్షలు చేశారని చెప్పారు. అంతేకాకుండా 2150 మందికి సెకండ్ టి ఆపరేషన్ చేశారని చెప్పారు. గ్రామీణ పేద ప్రజలకు ఈ కంటి దవాఖాన చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటివవైద్య నిపుణురాలు డాక్టర్ వైరాగ్యం-రిట బహదూర్ షా, డ్యూటీ డాక్టర్ రాజేంద్రనాథ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు చింతలపల్లి వెంకటరెడ్డి, కలంపల్లి రాములు,మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి అండగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

- ఎల్ఓసీ మంజూరుకు హామీ..

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి గడ్డం మధుకర్ (చోటు) హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ని మర్యాదపూర్వకలగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలతో పాటు, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక పేద కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఇందిరమ్మ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని కేసీఆర్? నగర్ 6వ వార్డుకు చెందిన వేముల నాగేష్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ (చీక్ష్మీమా) ఆస్పత్రిలో చూపించగా, వైద్యులు పరీక్షంచి అత్యవసరంగా డయాలసిస్ శాస్త్ర చికిత్స చేయాలని సూచించారు. ఇందుకు సుమారు 4 లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని 6వ వార్డు సభ్యులు కొండ భరత్, గుజ్జె మహేష్ మరియు కోట సతీష్‌లు కలిసి గ్రామ సర్పంచ్ గడ్డం రచన మధుకర్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడి ఆర్థిక పరిస్థితిని గమనించిన సర్పంచ్ వెంటనే స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ ఢ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ కి వివరించారు. బాధితుడి పరిస్థితిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుండి ఎల్ఓసీ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పేద ప్రజల ఆరోగ్య విషయంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. తమ విన్నపానికి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు గడ్డం మధుకర్ మరియు వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మార్కెట్ యార్డు మరమ్మత్తుల కోసం నిధులు విడుదల..

- మార్కెట్ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్



**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధికి మరమ్మత్తుల కోసం 14 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో బోయినిపల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధితో పాటు మరమ్మతులు కోసం ప్రభుత్వం పద్నాలుగు లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ యార్డులో కూలిపోయిన ప్రహరీ గోడ నిర్మాణం, మార్కెట్ యార్డులో కార్యాలయ పనుల మరమ్మతు కోసం నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కాగా నిధుల మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు చైర్మన్ ఎల్లేష్ యాదవ్ తో పాటు వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

# కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా మీ జాగీరు కాదని, ప్రజాస్వామ్యంలో మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన స్థాయి ఏంటో తెలుసుకోవాలని రవి గౌడ్ సూచించారు. కేటీఆర్‌కు ప్రజల నుంచి లభిస్తున్న విశేష ఆదరణను చూసి తట్టుకోలేక ఓర్వలేకనే ఇలాంటి అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, తెలంగాణ రాష్ట్ర తొలి ఐటీ శాఖ మంత్రిగా ఐటీ రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌ను చూసి కాంగ్రెస్ ఎందుకు భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షన నిలబడటం కేటీఆర్ బాధ్యత అని స్పష్టం చేశారు.




బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లేకపోతే రానున్న రోజుల్లో అనుచిత వ్యాఖ్యలకు తగిన రాజకీయ సమాధానం తప్పకుండా ఇస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ అవివేకపు వ్యాఖ్యలు మానుకోవాలని, లేనిపక్షంలో కేటీఆర్ సైనికులుగా, అభిమానులుగా చూస్తూ ఊరుకోబోమని రవి గౌడ్ హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన రాజకీయ తీర్పు ఇస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అరెల్లి వినయ్ కుమార్, నవీన్, ఏనుగుల సంజయ్, సామల ఆదిత్య, సందవేణి వివేక్, దేవులపల్లి వరుణ్, జంగిలి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ నల్ల మోహన్ ను సన్మానించిన తూడి లచ్చన్న.

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి సర్పంచ్ గా ఇటీవల గెలిచిన నల్ల మోహన్ ను తూడి లచ్చన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, గ్రామ ప్రజల మన్ననలు పొందాలని ఈ సందర్భంగా లచ్చన్న తెలిపారు.

# తిలక్ వర్మకు సర్జరీ..



- న్యూజిలాండ్‌తో తొలి మూడు టీ20లకు దూరం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పొట్టి ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్న యువ బ్యాటర్ తిలక్ వర్మ స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని గురువారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా వెల్లడించింది. బుధవారం రాజ్‌కోట్‌లో సర్జరీ చేయించుకున్న తిలక్ వర్మ కివీస్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు తిలక్ అందుబాటులో ఉండడని స్పష్టం చేసింది. బీసీసీఐ తెలిపిన వివరాల ప్రకారం.. "సర్జరీ అనంతరం తిలక్ వర్మ గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకుంటాడు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉంది. వేగంగా కోలుకుంటున్నాడు. పూర్తిగా కోలుకున్న అనంతరం ప్రాక్టీస్ ప్రారంభిస్తాడు. న్యూజిలాండ్‌తో జరిగే తొలి మూడు టీ20 మ్యాచ్‌లకు తిలక్ అందుబాటులో ఉండడు. అయితే, అతడు పూర్తిగా ఫిట్‌గా మారితే జనవరి 28న వైజాగ్‌లో, జనవరి 31న త్రివేంద్రంలో జరిగే చివరి రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం ఉంది" అని బీసీసీఐ పేర్కొంది.

**టెస్టిక్యులర్ టార్షన్ సర్జరీ**

రాజ్‌కోట్‌లో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అనూహ్యంగా గాయపడిన తిలక్ వర్మకు 'టెస్టిక్యులర్ టార్షన్ణ కారణంగా వైద్యులు సర్జరీ చేయాల్సి వచ్చింది. హైదరాబాద్ క్రికెట్ జట్టు కోచ్ డీబీ రవితేజ మాత్రం తిలక్ ఆరోగ్యంపై పెద్దగా ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. "రాజ్‌కోట్‌లో బుధవారం తిలక్ వర్మకు చిన్న సర్జరీ జరిగింది. మూడు, నాలుగు రోజుల్లో అతడు కోలుకుంటాడు. నాకౌట్‌కు హైదరాబాద్ అర్హత సాధించే అవకాశాలు లేనందున అతడిని ఆడించి రిస్క్ తీసుకోలేదని" రవితేజ తెలిపారు.




# యాషెస్ చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం

- సిడ్నీలో ఇంగ్లాండ్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు
- సిరీస్‌ను 4-1తో కైవసం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

యాషెస్ సిరీస్ చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో టెస్టులో ఇంగ్లాండ్‌పై ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 160 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ 31.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మార్నస్ లబుషేన్ (37), జేక్ వెదరాల్డ్ (34) కీలకంగా రాణించారు. దీంతో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-1 తేడాతో దక్కించుకుంది.

అంతకుముందు, ఓవర్‌నైట్ స్కోరుతో ఐదో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. జాకబ్ బెతెల్ (154) అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు. హ్యారీ బ్రూక్ (42), బెన్ డకెట్ (42) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, వెబ్‌స్టర్ చెరో 3 వికెట్లు, బొలాండ్ 2, నెసర్ 1 వికెట్ తీశారు. దీంతో ఆస్ట్రేలియాకు 160 పరుగుల లక్ష్యం లభించింది. లక్ష్య ఛేదనలో వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (16 నాటౌట్) విన్నింగ్ షాట్ బాదగా, కామెరూన్ గ్రీన్ 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 3, విల్ జాక్స్ 1 వికెట్ తీశారు.

**ఖవాజాకు వీడ్కోలు**

ఈ టెస్టుతో ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన ఖవాజాకు ఇంగ్లాండ్ ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. నాలుగు పరుగులు చేసి ఔటైన ఖవాజా, మైదానంలో "థంక్యూ ఉజీ" సందేశం వద్ద పిచ్‌ను ముద్దాడుతూ భావోద్వేగానికి లోనయ్యాడు.

# ఓటీటీలోకి శోభితా ధూళిపాళ్ల సస్పెన్స్ థ్రిల్లర్ 'చీకటిలో'

- జనవరి 23 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**




దక్షిణాది సినిమాలతో పాటు బాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న టాలెంటెడ్ నటి శోభితా ధూళిపాళ్ల త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'చీకటిలో' ఓటీటీలో విడుదలకు సిద్ధమైంది. శరత్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రం సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో రూపొందింది. అక్కినేని కుటుంబ కోడలిగా, నటిగా విభిన్న పాత్రలతో మెప్పిస్తున్న శోభితా ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నేరుగా ఓటీటీ విడుదల చేస్తున్నారు. చిత్రబృందం అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం, 'చీకటిలో' చిత్రం జనవరి 23 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. థ్రిల్లర్ కథనాలతో రూపొందిన ఈ సినిమా శోభితా కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలవనుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నేటి నుంచి మహిళల ప్రీమియర్ లీగ్

- తొలి మ్యాచ్‌లో ముంబయితో తలపడనున్న బెంగళూరు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం టోర్నమెంట్‌కు తెరలేవనుండగా, ఫిబ్రవరి 5న వడోదర వేదికగా జరిగే ఫైనల్‌తో ఈ సీజన్ ముగియనుంది. 28 రోజులపాటు మహిళా క్రికెట్ అభిమానులకు ఫ్రాంచైజీ క్రికెట్ మజా అందించేందుకు ఆటగాళ్లు సిద్ధమయ్యారు. ఐదు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇటీవల జరిగిన వేలంలో అన్ని జట్లు కొత్త ఆటగాళ్లను కొనుగోలు చేసి బరిలోకి దిగుతున్నాయి.

**తొలి మ్యాచ్‌లో ముంబయి బెంగళూరు ఢీ**

డబ్ల్యూపీఎల్‌లో అత్యంత సక్సెస్‌ఫుల్ జట్టైన ముంబయి ఇండియన్స్, రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా ముంబయి ఈ ఎడిషన్‌లో బరిలోకి దిగుతోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబయి జట్టు నాట్ సీవర్-బ్రంట్, అమెలియా కేర్, హేలీ మ్యాథ్యూస్‌లతో బలంగా కనిపిస్తోంది. మరోవైపు ఆర్సీబీ జట్టులో స్మృతి మంధాన, రిచా ఘోష్, నదైన్ డి క్లర్క్, జార్జియా వాల్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు.

ఈసారి డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు నవీ ముంబయి, వడోదర వేదికలుగా జరుగనున్నాయి. తొలి దశలో జనవరి 9 నుంచి 17 వరకు నవీ ముంబయిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అనంతరం జనవరి 19 నుంచి ఫిబ్రవరి 5 వరకు వడోదరలో టోర్నీ కొనసాగుతుంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతాయి. వీకెండ్లలో డబుల్ హెడర్ మ్యాచ్‌లు ఉండగా, మధ్యాహ్న మ్యాచ్‌లు 3.30 గంటలకు ప్రారంభమవుతాయి. టాస్ మ్యాచ్‌కు అరగంట ముందే ఉంటుంది.

**ప్రసారం వివరాలు**

డబ్ల్యూపీఎల్ 2026ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అలాగే ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోస్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది. జియోస్టార్‌లో మ్యాచ్‌లు చూడాలంటే సబ్‌స్క్రిప్షన్ అవసరం కాగా, ఎంపిక చేసిన జియో రీఛార్జ్ ప్లాన్లపై జియోస్టార్ ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను జియో అందిస్తోంది.

డబ్ల్యూపీఎల్ 2026 పూర్తి షెడ్యూల్ ఇదే..

జనవరి 9 ముంబై ఇండియన్స్ ఐం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (నవీ ముంబై)

జనవరి 10 యుపి వారియర్జ్ గుజరాత్ జెయింట్స్ (నవీ ముంబై)

జనవరి 10 ముంబై ఇండియన్స్ ఐం ఢిల్లీ క్యాపిటల్స్ ( నవీ ముంబై)

జనవరి 11 ఢిల్లీ క్యాపిటల్స్ ఐం గుజరాత్ జెయింట్స్ (నవీ ముంబై)

జనవరి 12 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐం యుపి వారియర్జ్, (నవీ ముంబై)

జనవరి 13 ముంబై ఇండియన్స్ ఐం గుజరాత్ జెయింట్స్ ( నవీ ముంబై)

జనవరి 14 యుపి వారియర్జ్ ఐం ఢిల్లీ క్యాపిటల్స్ ( నవీ ముంబై)

జనవరి 15 ముంబై ఇండియన్స్ ఐం యుపి వారియర్జ్ ( నవీ ముంబై)

జనవరి 16 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గుజరాత్ జెయింట్స్ ( నవీ ముంబై)

జనవరి 17 యుపి వారియర్జ్ ఐం ముంబై ఇండియన్స్ ( నవీ ముంబై)

జనవరి 17 ఢిల్లీ క్యాపిటల్స్ ఐం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (నవీ ముంబై)

జనవరి 19 గుజరాత్ జెయింట్స్ ఐం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( వడోదర)

జనవరి 20 ఢిల్లీ క్యాపిటల్స్ ఐం ముంబై ఇండియన్స్ ( వడోదర)

జనవరి 22 గుజరాత్ జెయింట్స్ ఐం యుపి వారియర్జ్ ( వడోదర)

జనవరి 24 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐం ఢిల్లీ క్యాపిటల్స్ ( వడోదర)

జనవరి 26 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ముంబై ఇండియన్స్ ( వడోదర)

జనవరి 27 గుజరాత్ జెయింట్స్ ఐం ఢిల్లీ క్యాపిటల్స్ ( వడోదర)

జనవరి 29 యుపి వారియర్జ్ ఐం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( వడోదర)

జనవరి 30 గుజరాత్ జెయింట్స్ ఐం ముంబై ఇండియన్స్ (వడోదర)

ఫిబ్రవరి 1 ఢిల్లీ క్యాపిటల్స్ ఐం యుపి వారియర్జ్ (వడోదర)

ఫిబ్రవరి 3 ఎలిమినేటర్ (వడోదర)

ఫిబ్రవరి 5 ఫైనల్ ( వడోదర)

# 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ నటుడు నవీన్ పొలిశెట్టి తన కామెడీ టైమింగ్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. సంక్రాంతి రేసులో నిలిచిన మోస్ట్ అవేటెడ్ మూవీ లిలి'అనగనగా ఒక రాజు'లిలి థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం గురువారం (జనవరి 8) ఘనంగా విడుదల చేసింది. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో విడుదల కానుంది. ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తూ సాగింది. నవీన్ పొలిశెట్టి తన ఎనర్జిటిక్ కామెడీతో మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేయబోతున్నాడనే నమ్మకాన్ని ట్రైలర్ కలిగిస్తోంది. ముఖ్యంగా కింగ్ అక్కినేని నాగార్జున అందించిన వాయిస్ ఓవర్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఆయన గంభీరమైన బేస్ వాయిస్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. గోదావరి జిల్లా నేపథ్యంగా, పెళ్లి చుట్టూ తిరిగే సరదా సంఘటనలు, హుషారైన డైలాగ్స్‌తో ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. నవీన్ కామెడీకి తోడు హీరోయిన్ మీనాక్షి చౌదరి అందం, నటన సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. మారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.

# యష్ 'టాక్సిక్ టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ రాకింగ్ స్టార్ యష్ అభిమానుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. యష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్ణ నుంచి టీజర్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. ఈ టీజర్ ప్రారంభం నుంచే ప్రేక్షకులను ఓ డార్క్ గ్యాంగ్‌స్టర్ ప్రపంచంలోకి తీసుకెళ్లింది. ఇందులో యష్ పాత్ర పేరురాయగా వెల్లడైంది. స్మశానవాటిక నేపథ్యంలో కారుతో యష్ ఇచ్చే పవర్‌ఫుల్ ఎంట్రీ సీన్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచింది. పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, నోట్లో సిగార్, చేతిలో ఆధునిక ఆయుధంతో యష్ మునుపెన్నడూ లేని విధంగా స్టైలిష్‌గా, క్రూరంగా కనిపించారు.టీజర్ చివరలో గన్‌తో ఫైర్ చేస్తూ యష్ చెప్పే "డాడీ ఈజ్ హెూము డైలాగ్ థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఈ చిత్రాన్ని కేవలం యాక్షన్ సినిమాగా కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఓ డార్క్ ఫెయిరీ టేల్గా తీర్చిదిద్దినట్లు టీజర్ స్పష్టం చేసింది. రవి బస్రూర్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ




భారీ ప్రాజెక్టులో యష్ సరసన నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషీ, రుక్మిణి వసంత్ వంటి స్టార్ హీరోయిన్లు నటిస్తుండటం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. 'టాక్సిక్ణ చిత్రం మార్చి 19, 2026న తెలుగు, కన్నడ, హిందీ, తమిళం, మలయాళంతో పాటు ఇంగ్లీష్ భాషల్లో కూడా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.